# సీఎం కేసీఆర్ పాలన మెచ్చే బీఆర్ఎస్‌లోకి..

- కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయి
- వికారాబాద్ ఎంపీపీ చంద్రకళకమాల్‌రెడ్డి
- మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిక



మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన ఎంపీపీ చంద్రకళ, చిత్రంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, అక్టోబర్ 22 : కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయని, క్రమశిక్షణ లోపించిందని వికారాబాద్ ఎంపీపీ చంద్రకళకమాల్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ ఆధ్వర్యంలో ఎంపీపీ చంద్రకళకమాల్‌రెడ్డితోపాటు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత 50 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేసినట్లు వివరించారు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయని, క్రమశిక్షణ లోపించిందన్నారు. సీఎం కేసీఆర్ పాలనను మెచ్చే బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. దసరా పండుగ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి భారీగా బీఆర్ఎస్‌లోకి వలసలు ఉంటాయన్నారు. అదేవిధంగా వికారాబాద్ మండలా ధ్యక్షులు కమాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కూడా మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుష్పలతారెడ్డి, కౌన్సిలర్లు కిరణ్‌పటేల్, మండల వైస్ ఎంపీపీ రాములు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్ల నందు, వేణుగోపాల్ తదితరులున్నారు.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన అనంతరెడ్డి



భవిష్యత్తు మనదేనని.. ఎవరూ నిరుత్సాహపడొద్దని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది మన పార్టేనని.. అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ వారికి సూచించారు. -మొయినాబాద్, అక్టోబర్ 22

## ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

మంత్రి సబితారెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 22: ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బంజారాబస్తీ ఫేస్-1కు చెం దిన పలువురు యువకులు బీఆర్ఎస్ ఆర్కేపురం డివిజన్ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌గుప్తా ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి సైనికుల్లాంటి కార్యకర్తల బలం ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేశ్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఓటెయ్యండి

- కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- హస్తం వీడి గులాబీపార్టీలో చేరిన 430 మంది



ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ పార్టీలో చేరుతున్న మద్దూర్ మండల కాంగ్రెస్ కార్యకర్తలు

కొడంగల్, అక్టోబర్ 22 : ఇతర పార్టీల నుంచి చేరికలతో కొడంగల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ బలోపేతమవుతున్నది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో భారీగా చేరుతున్నారు. ఆదివారం మద్దూర్ మండలంలోని అప్పిరెడ్డిపల్లి, గుండుమాల్, హన్మాన్‌పల్లి, బలభద్రాయపల్లి, దౌల్తాబాద్ మండలంలోని చెల్లాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు 400 మందికిపైగా ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గాభివృద్ధి సాధ్యమన్నారు. అందరం కలిసి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. ఎన్నికల సమయంలోనే గ్రామాల్లోకి వచ్చే నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. 2018కు ముందు కొడంగల్‌ను ఏ నాయకుడు కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజల సంక్షేమానికి కృషి చేసే, అభివృద్ధికి పాటుపడే బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు ఆయన హామీచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# మన పథకాలు దేశానికే ఆదర్శం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- బీఆర్ఎస్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మధురాపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు

షాద్‌నగర్ రూరల్, అక్టోబర్ 22 : రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి, మధురాపూర్ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధి ఎంతో కృషి చేస్తున్నారని.. అన్ని వర్గాల అభ్యున్నతికోసం పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని.. ఇంటింటికీ అందుతున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు.రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాననని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, అక్టోబర్ 22 : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కడ్తాల్ గ్రామానికి చెందిన రాంచరణ్, అనిల్, మహేశ్, రవి, రేణు, నరేశ్‌తోపాటు మరో 20 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు యువత అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు ఒరిగిందేమీలేదని ఎద్దేవా చేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలిస్తున్న కాంగ్రెస్ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, బీఆర్ఎస్, రైతు సమన్వయ సమితి గ్రామాధ్యక్షులు వెంకటేశ్, నర్సింహ, నాయకులు శ్రీను, లాయక్‌అలీ, మహేశ్, భిక్షపతి, గణేశ్, అశోక్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- ప్రతిపక్షపార్టీలు ఖాళీ అవుతున్నాయి
- పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గులాబీపార్టీలో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

పరిగి, అక్టోబర్ 22 : పరిగి పట్టణంతోపాటు మండలంలోని పోల్కంపల్లి, తొండపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. పరిగిలోని 5, 10 వార్డులకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 100 మంది, పోల్కంపల్లికి చెందిన 50 మంది, తొండపల్లికి చెందిన మరో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు గులాబీ పార్టీలో చేరగా వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరికలతో ప్రతిపక్ష పార్టీలు బెంబేలెత్తుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విపక్ష పార్టీలు ఖాళీ అవుతున్నాయని, బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. అదేవిధంగా గండీడ్ మండలంలోని అంచన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో సీనియర్ నాయకుడు బాలిరెడ్డి, కిష్టయ్య, రాజు, కిష్టయ్య తదితరులున్నారు.



పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన పరిగిలోని 5, 10 వార్డులకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కమాల్‌పూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కమాల్‌పూర్, ముద్దాయిపేట గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించి.. అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపారని కొనియాడారు. అన్ని వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా ఆయన పాలన సాగుతున్నదన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని అందించి ఆదుకుంటున్నారన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేస్తానని హామీచ్చారు. అనంతరం కమాల్‌పూర్‌తోపాటు ముద్దాయిపేట గ్రామాల్లో ఆయన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు పురుషోత్తమరావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.